కథావేదిక

# పడమటి సంధ్యారాగం

## కె.కె. భాగ్యశ్రీ

పట్టాలమీద స్పీడుగా సాగిపోతున్న ట్రెన్‌లోంచి చకచకా పరుగుతీసే చెట్లని, గుట్టల్ని, కరెంటు స్తంభాల్ని దీక్షగా పరికిస్తున్నాడు రమణమూర్తి.

ఇలా ట్రెన్ వేగంగా వెళ్తుంటే అవన్నీ పరుగెత్తుతున్నట్లుగా అనిపిస్తాయి మనకు. కానీ అవి నిజంగానే పరుగెడ్తాయా? లేదు. ట్రెన్ పరుగెడ్తుంటే వాటికీ చలనం వచ్చినట్లుగా అనిపిస్తుంది.

జీవితాలు కూడా అంతే. కాలంతో పోటీ పడుతున్నట్లుగా పరుగెడతాయి. నిజానికి ప్రయాణించేవి బ్రతుకులు కావు. కాలం మాత్రమే. సుదీర్ఘమైన కాల ప్రయాణంలో చకచకా ముందుకు సాగే సుఖదుఃఖాల సమ్మేళనాల సంఘటనలు... అవే మన జీవన యానంలో మైలురాళ్లు.

తను వేదాంత ధోరణిలో పడిపోతున్నాడా? నవ్వుకున్నాడు రమణమూర్తి. అతని సీటుకెదురుగా ఉన్న సీటులో ఎవరో పంజాబీ ఫ్యామిలీ కూర్చుని ఉన్నారు. వాళ్ల పిల్లలు ముద్దుగా, బొద్దుగా వున్నారు. బ్యాగ్ లోంచి బిస్కెట్ ప్యాకెట్ తీసి వాళ్లకిచ్చాడు రమణమూర్తి.

''థాంక్స్ అంకుల్'' ముద్దుగా పలికారు వాళ్ళు.

'వాళ్ళ ముఖాల్లో ఎంత నిర్మలత. ఏ మాలిన్యం అంటని లేత హృదయాలు వారివి' అనుకున్నాడు రమణమూర్తి తనలో తనే.

ఏదో చిన్న స్టేషన్‌లో బండి ఆగింది.

ప్లాట్‌ఫామ్ మీద తినుబండారాలు అమ్మేవారిలో చైతన్యం చిగురించింది.

''కాఫీ...కాఫీ...టీ...టీ'' అని కేకలు వేసుకుంటూ ప్లాట్‌ఫామ్ అంతా కలియదిరుగుతున్నారు పానీయాలమ్మే కుర్రాళ్ళు.

ఎవరి తాపత్రయం వారిది.

''సరేరా తమ్ముడూ. ఇంక వుంటాను. చేరగానే లెటర్ వ్రాస్తానులే'' అంటూ హడావుడిగా ట్రెన్ ఎక్కింది ఒకామె.

''జాగ్రత్త అక్కయ్యా! ఉంటాను'' చెప్పి చేయి ఊపాడతను. ట్రెన్ చిన్న కుదుపుతో మెల్లగా కదిలి వేగాన్ని పుంజుకోసాగింది రానురాను. ఆవిడ మెల్లగా రమణమూర్తి ఎదురుగా వున్న సీట్ దగ్గరకు వచ్చింది. ఆ సీట్లో వున్న పంజాబీ ఫ్యామిలీ సర్దుకుని ఆమెకు సీటిచ్చారు.

సామాను సర్దుకుని తన సీట్లో చారబడి నుదుట పట్టిన చెమటను సుతారంగా కర్చీఫ్‌తో తుడుచుకోసాగింది ఆమె.

ఆమెకు దరిదాపుగా యాభై సంవత్సరాలు వుండవచ్చు. లేత గచ్చపిక్కరంగు బెంగాల్ కాటన్ చీర ధరించింది. మెడలో సన్నని చెయిన్, చెవులకు ఏడురాళ్ళ దుద్దులు. చేతికి వాచ్. చాలా సింపుల్‌గా వుందామె.

జుత్తు అక్కడక్కడ కొద్దిగా నెరిసింది. చిన్న ముడి వేసుకుంది. ఆమె చాలా డిగ్నిఫైడ్‌గా వుంది.

ఆమెనే పరిశీలనగా చూస్తున్న రమణమూర్తి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఆమె...ఆమె...సంధ్య కాదు కదా! కాదు కదా ఏంటి? సంధ్యే. తన జీవితంలో ఉషఃకాంతులు నింపుతుందనుకున్న సంధ్య...తనని ఎడబాసి చివరకు ఇక్కడ...ఇలా...

జీవితం చాలా విచిత్రమైనది. ఏ ఏ మజిలీలు చేయాలో, ఎవరెవరిని ఎప్పుడెప్పుడు కలవాలో తెలియని అగమ్యయానం. లేకపోతే పాతికేళ్ళక్రితం తన నుండి దూరమైన సంధ్య అనుకోకుండా ఇన్నాళ్లకి కలవడం...

సంధ్యని పలకరించాలా వద్దా ! ఆలోచనలో పడ్డాడు రమణమూర్తి.

చివరకి పలకరించాలనే నిర్ణయించుకున్నాడు.

''మీరు...మీరు...నువ్వు సంధ్య కదూ'' అస్పష్టంగా గొణిగాడతను.

అతని మాటలకు తలెత్తి చూసిన ఆమె అతని ముఖం చూస్తూనే కాసేపు ఏదో ఆలోచించినట్లుగా ఉండిపోయింది. అతనిని గుర్తు పట్టిన ఆమె ముఖం వెలిగిపోయింది.

ఆమె హృదయపు పూల తోటలో ఏవో జ్ఞాపకాల సుగంధాలు పరిమళించాయి.

''నువ్వు...నువ్వు మూర్తి కదూ!'' ఆనందంతో పొంగిపోతూ అంది సంధ్య.

''బాగున్నావా సంధ్యా! ఎలా వున్నావు? ఎక్కడున్నావు? ఏం చేస్తున్నావు?' గబగబా ప్రశ్నల వర్షం కురిపించాడు మూర్తి.

''అప్పటికీ ఇప్పటికీ నువ్వేం మారలేదు మూర్తీ. అదే తొందర, అవే మాటలు'' ఫక్కున నవ్వింది సంధ్య.

మంచి ముత్యాలకోవలాంటి పలువరుస తళుక్కుమంది. ఇదిగో ఈ అందమైన దరహాసం, అపురూపమైన ఆమె రూపం...ఇవి చూసేగా తను మనసు పారేసుకున్నది.

పరిచయమైన తరువాత చనువు పెరిగిన కొద్దీ అర్థమైన ఆమె విలక్షణ వ్యక్తిత్వం తను ఆమెపై ప్రేమ పెంచుకునేందుకు దోహదపడింది. కానీ...కానీ బ్యాడ్‌లక్ తను ఆమెని పొందలేకపోయాడు..

అలా పొందలేకపోయినందుకు దారి తీసిన పరిస్థితులు ఒక్కసారిగా అతని మస్తిష్కంలో గిర్రున తిరిగాయి.

సంధ్యది చాలా పెద్ద ఫ్యామిలీ. ఆమె తండ్రి గవర్నమెంట్ ఆఫీస్‌లో క్లర్క్‌గా చేసేవాడు. అతి కష్టంమీద సంధ్య మీద అమ్మాయికి పెళ్ళి చేసాడు. అనుకోకుండా హార్ట్ ఎటాక్‌తో మరణించాడు.

ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బరువు అతని గుండెను అర్థాంతరంగా ఆగిపోయేటట్లు చేశాయి.

సర్వీస్‌లో ఉండగానే అతను మరణించినందుకు రూల్స్ ప్రకారం అర్హురాలైన సంధ్యకు ఆ ఉద్యోగం వచ్చింది. తన తరువాత వున్న ఇద్దరు తమ్ముళ్లనీ, చెల్లెళ్లనీ పోషించవలసిన బాధ్యత ఆమె భుజస్కందాలమీద పడింది.

సంధ్య ఆ జాబ్‌లో జాయినయ్యేసరికి ఆఫీసులో యుడిసిగా పని చేస్తున్నాడు మూర్తి.

సంధ్య అందాన్ని, ఆమె నిరాడంబరత్వాన్ని అభిమానించి ఆమెను వలచాడు మూర్తి. ఆమెనే పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకుని తన నిర్ణయాన్ని ఆమె ముందు పెట్టాడు.

సంధ్యతో ఈ విషయం చెప్పగానే ఒక్క నిముషం ఆమె ముఖం వెలిగిపోయింది. కానీ అంతలోనే గంభీరంగా మారిపోయింది.

''చూడండి మూర్తిగారూ! మీరంటే నాకిష్టం లేక కాదు. కానీ నా సంగతి మీకు బాగా తెలుసనుకుంటాను. నేను తప్ప మావాళ్ళకి ఇంకో ఆధారం లేదు. నా సంపాదన మీదే వాళ్ళందరూ ఆధారపడి

వున్నారు. ఈ పెళ్ళి చేసుకుని వాళ్ళని గాలికొదిలేయ లేను'' నిక్కచ్చిగా తన మనసులోని అభిప్రాయం చెప్పింది సంధ్య.

అప్పుడు మూర్తి, ప్రకాష్, పద్మల దుష్టాంతం తెచ్చాడు.

అదే ఆఫీస్‌లో పని చేస్తున్న భార్యాభర్తలు ప్రకాష్, పద్మలు.

వాళ్ళిద్దరి కేస్ సేమ్ ఇటువంటిదే.

పద్మ కూడా ఇంటికి పెద్దకూతురే. ఆమెకీ తండ్రి మరణంవల్లనే ఈ ఉద్యోగం వచ్చింది. ప్రకాష్ పద్మను ప్రేమించాడు. వాళ్లిద్దరూ కలసి ఇద్దరి బాధ్యతను కంబైన్డ్‌గా పంచుకోవాలని నిర్ణయించుకునే ఈ పెళ్లి చేసుకున్నారు.

ఈ సంగతి చెప్పాక సంధ్య కొంచెం మెత్తబ డింది.

''వారిద్దరిలాగే మనం కూడా పరస్పరం బాధ్యతలను షేర్ చేసుకుని జీవితంలో సెటి లవుదాం'' అని మూర్తి సంధ్యను ఒప్పిం చాడు.

సంధ్యకి ప్రధాన సమస్య సాల్వ్ అయిపో యినమీదట మూర్తిని కాదనడానికింకేం ఇతర కారణాలు కనబడలేదు. అందగాడు, ఉద్యోగస్తుడు. అన్నింటినీ మించి మనసున్న వాడు.

మంచిరోజు చూసుకుని ఇద్దరూ ఒకటవు దామనుకున్నారు.

కానీ... కానీ... ఆ రోజు పద్మ మానసిక వేదన కళ్ళారా చూసిన సంధ్య తన నిర్ణ యాన్ని మార్చుకుంది.

ఆ రోజు లంచ్ అవర్‌లో ప్రకాష్, మూర్తి ఆఫీసు బయటకు వెళ్లారు.

పద్మ మూడీగా కూర్చుని వుంది. ఆమె కళ్లల్లో చెప్పలేని దిగులు.

సంధ్య ఆమె దగ్గరగా వెళ్లి ''ఏం పద్మా! ఎందుకలా వున్నావు? ఏం జరిగింది?'' అని ప్రశ్నించింది.

పద్మ కళ్లల్లో నీళ్ళు గంగలా ఉబికాయి.

''చూడు సంధ్యా! ప్రకాశ్ ఏమంటున్నాడో. మొన్న మనందరికీ ఎరియర్స్ వచ్చాయికదా. అందులో నా వాటా డబ్బు మా చెల్లెలి పేర ఫిక్స్‌డ్ చేద్దామని అనుకున్నాను. కానీ ప్రకాశ్ వీల్లేదు మీ చెల్లెలు పెళ్లికి ఇంకా టైముంది కదా! ఆ డబ్బుతో మనం ఫ్రిజ్, కూలర్ కొను క్కుందామని గొడవ చేస్తున్నాడు. ఇప్పుడవి అంత అవసరమంటావా? అని నేనెంతగా చెప్పినా వినిపించుకోవడంలేదు. ఏం చేయాలో తోచడంలేదు'' అంది బాధగా పద్మ.

ఆమె మాటలు విన్న సంధ్య ఆలోచనలో పడింది. రేపొద్దున మూర్తి కూడా ఇలా ప్రవ ర్తిస్తే? తన వాళ్ళని విస్మరించమని శాసిస్తే... అప్పుడు తనకేం దారి? ఈ ఊహ రాగానే సంధ్య కంపించిపో యింది. తన నిర్ణయాన్ని మార్చుకుంది.

మూర్తేకాదు, ఎవరెన్ని విధాల చెప్పినా వినిపించుకో లేదు. కర్తవ్యం ముందు కోరికలన్నీ తృణప్రాయంగా గోచరించాయామెకి.

తనమీద ఆధారపడిన తనవారిని వృద్ధిలోకి తేవ డమే తన లక్ష్యమంది.

తను ప్రకాశ్‌లా సంకుచితంగా ఆలోచించనని, స్వార్థపరుడిలా మారనని శతవిధాల ఆమెకు నచ్చచె ప్పాడు మూర్తి.

కానీ సంధ్య అంగీకరించలేదు.

చేసేదిలేక సంధ్యని చూస్తూ అక్కడ వుండలేక వేరే ఊరు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్లిపోయాడు మూర్తి.

తల్లిదండ్రుల బలవంతంమీద వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు మూర్తి. ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి పుట్టారు.

పిల్లలు చిన్నవాళ్ళుగా వుండగానే అనుకోకుండా భార్య మరణించింది. మళ్లీ ఒంటరి జీవితానికి అల వాటుపడిపోయాడు మూర్తి. ఎవరెన్ని విధాల చెప్పినా మళ్లీ పెళ్లి చేసుకోలేదు.

''హలో! మూర్తీ! ఏంటలా ఆలోచనల్లోకి వెళ్లిపో యావు?'' ముఖంమీద చిటికె వేస్తూ పిలిచింది






## విశ్రాంతి తీసుకుంటే అనారోగ్యం మటుమాయం

రొటీన్ పని ఒత్తిడి నుంచి దూరమై కొద్దికాలం పాటు విశ్రాంతి తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని ఆస్ట్రేలియా రీసెర్చర్లు చెబుతున్నారు. యూనివర్శిటీ ఆఫ్ వియెన్నాలో ఫిజియాలజిస్టు గెర్హార్డ్ స్ట్రాన్ బ్లాష్ప్ మరికొందరితో జరిపిన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది. రెండువారాల విశ్రాంతి లభిస్తే చాలు...ఉద్యోగుల శారీరక ఆరోగ్యంపై ప్రభావం వుంటుందని వీళ్ళు తేల్చి చెప్పారు. దీనివలన మూడ్ కూడా మారుతుందట. నిద్ర మీద కూడా అంతో ఇంతో ప్రభావం వుంటుందంటున్నారు. పరిశోధనలో భాగంగా ఉద్యోగాలకు కొన్ని ప్రశ్నలిచ్చారు. విశ్రాంతికి పదిరోజులముందు, విశ్రాంతి తరువాత మూడురోజుల్లో శారీరక ఇబ్బందులు, స్ట్రెస్, అనారోగ్యం, జీవితంపట్ల సంతృప్తి తదితర అంశాలపై అభిప్రాయ సేకరణ చేశారు. ఇందులో 61 శాతంమంది విశ్రాంతి సమయాన్ని సంతృప్తిగా గడిపామని చెబితే మూడోవంతుమంది అసలు సరిగ్గా ప్లాన్ చేసుకోలేకపోయామని చెప్పారు.

ఆరోగ్యం కుదుటపడాలన్న ఆలోచన లేకుండా విశ్రాంతి సమయాన్ని గడిపేస్తే ఆ ప్రభావం అంతగా ఉండకపోవచ్చని తేలింది.

పనినుంచి దూరమైన సమయంలో సరైన రిక్రియేషన్ వుండాలని, వ్యక్తిగత అవసరాలకు, అభిరుచులకు అనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని, అప్పుడే ఫలితం వుంటుందని బ్లాష్ప్, ఆయన సహచరులు స్పష్టం చేసారు.

-పల్లవి




సంధ్య.

''ఆ...ఆ'' అంటూ తత్తరపడి ''ఏంలేదు'' అని సర్దుకున్నాడు.

''చెప్పు మూర్తీ! పెళ్లి చేసుకున్నావా? పిల్లలెంత మంది? ఆవిడెలా వుంటారు?'' చనువుగా అడిగింది సంధ్య.

''ఆ...పెళ్లి చేసుకున్నాను. ముగ్గురు పిల్లలు. కానీ ఆవిడలేదు. చనిపోయి పదిహేడేళ్లయింది'' నిర్లిప్తంగా అన్నాడు మూర్తి.

''ఓ అయాం సారీ! అనవసరంగా నిన్ను బాధపెట్టాను. ఏమీ అనుకోకు'' అంది సంధ్య.

''ఫర్వాలేదులే. నీ సంగతేంటి? నువ్వు పెళ్లి చేసుకున్నావా? మీవారేం చేస్తున్నారు?'' కుతూహలం ధ్వనించింది మూర్తి కంఠంలో.

''నేను పెళ్లి చేసుకోలేదు మూర్తీ. నాకున్న బాధ్యతలముందు పెళ్లి చిన్న విషయంలా కనబడింది. అయినా పెళ్లి చేసుకునే ఉద్దేశ్యమే వుంటే ఆనాడు నిన్ను కాదన్నేదాన్నికాదు'' గంభీరంగా చెప్పింది సంధ్య గోళ్లవైపు చూసుకుంటూ.

మూర్తి మనసు ఆ మాటలకి ద్రవీభవించింది. సంధ్యని చూస్తే జాలనిపించింది.

''పెద్దతమ్ముడు ఇంజనీర్‌గా చేస్తున్నాడు. చిన్నతమ్ముడు గ్రామీణ బ్యాంక్‌లో పని చేస్తున్నాడు. చెల్లెళ్లిద్దరూ ఎవరి సంసారాలు వారు చేసుకుంటున్నారు. మరి నీ పిల్లలు...'' సంధ్య అడిగింది అతన్ని మళ్లీ.

''అమ్మాయిలిద్దరికీ పెళ్లిళ్ళు చేసాను. అబ్బాయి మంచి జాబ్‌లో వున్నాడు. అది సరే. అందర్నీ ప్రయోజకుల్ని చేసావు. మరి నువ్వు...''

''నాదేముంది మూర్తీ. ఎవరి దగ్గర కావలిస్తే వారి దగ్గర వుండవచ్చు. అయినా నాకు తోడుగా నా జాబ్, ఆపై ఒంటరి జీవితం వుండనే వుందిగా'' నవ్విన ఆమె కళ్లల్లో నీటిముత్యాలు మెరిసాయి. ఎంత దాచుకుందామనుకున్నా అవి మూర్తి కంటపడనే పడ్డాయి.

ఎదురుగా వున్న పంజాబీ ఫ్యామిలీ వీరిద్దరి సంభాషణని ఆసక్తిగా వింటున్నారు. కానీ వారికొక్క ముక్క కూడా అర్థం కావడంలేదు.

పదిగంటలు అవుతుండగా మాటలకి ఫుల్‌స్టాప్ పెట్టి బెర్తులు దించారు.

''గుడ్ నైట్ మూర్తీ'' చెప్పి నిద్రకు ఉపక్రమించింది సంధ్య.

కన్ను పొడుచుకున్నా మూర్తికి నిద్ర రావడంలేదు. సంధ్య గురించే ఆలోచిస్తున్నాడు.

అందరికోసం కరిగిపోయిన కొవ్వొత్తి సంధ్య. ఆమె ఏం సుఖపడింది జీవితంలో? తను కూడా భార్య పోయాక ఒంటరిగా బ్రతుకుతున్నాడుగానీ మరెవ్వరికీ తన జీవితంలో స్థానమివ్వలేదు.

ఇప్పుడు సంధ్యను ఇలా చూసాక తన మనసులో మళ్ళీ ఆశలు చిగురించసాగాయి.

తనూ, సంధ్యా ఒకటైతే! ఆశల హరివిల్లు వెలసింది అతనిలో.

దీనికి సంధ్యేమంటుందో? అడిగి చూస్తే...

సంధ్యకి బాధ్యతలన్నీ తీరిపోయాయి. ఆమెకింకేం అభ్యంతరం వుంటుంది? కాదనదు. తన కోరిక తప్పక మన్నిస్తుంది. ఆలోచనల మధ్య కలత నిద్రపోయాడు మూర్తి.

తెల్లవారింది. రాత్రి ఎప్పుడు దిగిపోయారో పంజాబీ వాళ్ళు! ఎదుటి సీటంతా ఖాళీగా వుంది. వైజాగ్ స్టేషన్ సమీపిస్తోంది.

''గుడ్‌మార్నింగ్ మూర్తీ. అన్నట్లు నువ్వుండేది వైజాగ్‌లోనేనా?'' అంది సంధ్య.

''లేదు. పెద్దమ్మాయి వుండేది ఇక్కడే. చూడడానికి వెళ్తున్నాను'' అన్నాడు మూర్తి.

తన మనసులో మాట వెల్లడించడానికి ఇదే తగిన సమయం అనుకున్నాడు.

''సంధ్యా! చిన్నమాట. ఏమనుకోవు కదా'' సందేహిస్తూనే అన్నాడు మూర్తి.

'ఏమిటన్నట్లు' చూసింది సంధ్య.

''మరేం లేదు. నువ్వు అవివాహితగా ఇలా వుండిపోయావు. నాకా భార్యపోయి చాలా ఏళ్ళయింది. అందుకని...'' నసిగాడు మూర్తి.

''అందుకని?''''

''అదే...మరిద్దరం ఒకటైతే...మనిద్దరం పెళ్లి చేసుకుందాం!''

''ఈ వయసులోనా?'' ఆశ్చర్యంగా అడిగింది సంధ్య.

''ఏం? నడి వయసులో పెళ్లి చేసుకున్నవాళ్లెంత మంది లేరు? ఇన్నాళ్ళూ అందరికోసం పాటుపడ్డావు. కనీసం ఇప్పుడైనా నీ జీవితంలో నాకు భాగం పంచుతావా?''

''నాకు...నాకు ఆలోచించుకునేందుకు సమయం కావాలి.''

''నేను వైజాగ్‌లో నాలుగురోజులుంటాను. ఈ లోపు నువ్వొక నిర్ణయానికి వస్తావని ఆశిస్తున్నాను'' భారంగా అన్నాడు మూర్తి.

''నేను ఆలోచించి లెటర్ వ్రాస్తాను. నీ హైదరాబాద్ అడ్రస్ ఇవ్వు మూర్తీ'' అంది సంధ్య సాలోచనగా.

మరేం మాట్లాడకుండా తన అడ్రస్ రాసిచ్చాడు

మూర్తి.

అన్ని బాధ్యతల నుండి ఒడ్డెక్కాక కూడా సంధ్య ఎందుకు ఆలోచిస్తోందో? మూర్తి మెదడులో సందేహాల వలయాలు గిర్రున తిరగసాగాయి.

వైజాగ్ స్టేషన్‌లో ట్రైన్ ఆగింది. లగేజ్ తీసుకుని బయటకు నడిచారిద్దరూ. మూర్తి అల్లుడు, కూతురు స్టేషన్‌కువచ్చారు.

వారిద్దరికీ సంధ్యను తన పాత ఫ్రెండ్‌గా పరిచయం చేసాడు మూర్తి.

సంధ్యకు నమస్కరిస్తూ పరిశీలనగా ఆమెవైపు చూసింది ఆ అమ్మాయి. మేనత్త ద్వారా తండ్రి సంధ్య అనే ఆమెను పెళ్లి కాక మునుపు ప్రేమించాడని విని వుంది.

ఆమె కళ్లల్లో సంధ్యపట్ల నిర్వచించలేని భావమేదో వ్యక్తమైంది.

అది సంధ్య దృష్టిని దాటిపోలేదు.

మూర్తి దగ్గర వీడ్కోలు తీసుకుని బయటకు నడిచింది సంధ్య.

• • •

వైజాగ్‌లో వున్న నాలుగురోజులు సంధ్య దగ్గర్నుండి మెసేజ్ ఏమైనా వస్తుందేమోనని కన్నులు కాయలు కాచేలా ఎదురుచూసాడు మూర్తి. కానీ అతని ఆశ అడియాసే అయింది.

హైదరాబాద్ తిరిగి వచ్చేసాడు మూర్తి.

అతని వచ్చేసిన పదిరోజులకి అతనికి సంధ్య దగ్గర్నుండి లెటర్ వచ్చింది.

ఆతృతగా లెటర్ విప్పి చదవడం మొదలుపెట్టాడు మూర్తి.

ప్రియమైన మూర్తికి,

నమస్కారములతో సంధ్య వ్రాయునది.

నువ్వు నా దగ్గర ప్రస్తావించిన విషయం గురించి బాగా ఆలోచించాను. బాగా ఆలోచించిన మీదట నేనో నిర్ణయానికి వచ్చాను. బహుశా అది నిన్ను డిసప్పాయింట్ చేయువచ్చును. కానీ అదే సరైన నిర్ణయం అని నా మనసు చెప్పింది. ఇంకోసారి నిన్ను, నీ మాటను తిరస్కరించలసిన పరిస్థితి ఏర్పడింది.

ఇలా ఎందుకు చేశానో నీకు అర్థమయ్యేటట్లు చెప్పాల్సిన విధి నాకుంది.

జీవితంలో ఎన్నో సుఖాలు అనుభవించవలసిన వయసులో నావాళ్ళ బాగోగులు చూడ్డానికి అన్ని బాధ్యతలు నెత్తిన వేసుకున్నాను. వారందరినీ పైకి తీసుకురావాలన్న లక్ష్యంలోనే నా సుఖం ఉందనుకున్నాను. వారితో నా బంధం విడదీయరానంతగా పెరిగిపోయింది. ఇప్పుడు వారిందరినీ కాదని నా దారి నేను చూసుకోవడం అంత మంచి పని కాదని నేనను కుంటున్నాను. వారు ఈ పనికి బయటకు హర్షించినా లోలోపల నాపట్ల ద్వేషం పెంచుకునే ప్రమాదం వుందని నాకనిపించింది. ఎందుకంటే ఈ వయసులో నేనో తోడు వెతుక్కోడంవలన నేనేదో ఇప్పుడు శారీరక సుఖాలకోసం వెంపర్లాడుతున్నానని వారికనిపిస్తుందని నా భావన.

అలాగే నీ సంగతి చూసుకో. పిల్లలు చిన్న వయసులో ఉండగానే నువ్వింకో పెళ్లి చేసుకుంటే కొన్నాళ్ళు సవతి తల్లిని ద్వేషించినా మెల్లగా ఆమెకి అలవాటు పడేవారు. కానీ...కానీ వాళ్లు పెద్దవాళ్ళయినాక నువ్వు నన్ను పెళ్లి చేసుకుంటే వాళ్ళు నీమీద కోపం పెంచుకుంటారు.

అంత గట్టిగా ఎలా చెప్తున్నాననుకుంటున్నావా? ప్లాట్‌ఫామ్‌మీద నీ కూతురికి నన్ను పరిచయం చేసినప్పుడు ఆమె కళ్లల్లో నాపట్ల గోచరించిన భావానికి ఏ పేరు పెట్టాలో నాకు తెలియలేదు. కానీ నా దృష్టిలో అది నాపట్ల వ్యతిరేకత అనిపించింది. క్షణకాలం పరిచయంలోనే ఆ భావం కనబరచిన ఆమె జీవితాంతం నన్ను తల్లిగా అంగీకరించగలదా? ఆలోచించు. ఇన్నాళ్ళూ ఆ పిల్లలకు తల్లివైనా, తండ్రివైనా నువ్వే. ఇప్పుడు నీ జీవితంలో అడుగుపెట్టి వారి నుంచి నిన్ను దూరం చేయలేను.

అలాగే నావారితో పెనవేసుకుపోయిన అనుబంధాన్ని ఒక్కసారిగా త్రెంచుకోలేను. మన వయసులు పడమటికి వాలిపోతున్న ఈ తరుణంలో నీవారిని నువ్వు, నావారిని నేను బాధపెట్టి బావుకునేదేమిటి చెప్పు. అందుకే నేనీ నిర్ణయానికి వచ్చాను.

నా నిర్ణయం నిన్ను అంతులేని వేదనకు గురిచేస్తుందని తెలుసు. కానీ ఇది తప్పనిసరి. మరోమారు నిన్ను నిరాశకు గురి చేస్తూ

నీది కాలేని


సంధ్య

ఉత్తరం చదివిన మూర్తి పెదవులమీద జీవంలేని చిర్నవ్వు చోటుచేసుకుంది. తను తొందరపడ్డాడా? పరులకోసం అంకితమైన జీవితం ఆమెది. సంధ్య ఏ నిర్ణయం తీసుకున్నా, అది తననెంత బాధపెట్టినా అది అసమంజసం మాత్రం కాదు. దటీజ్ సంధ్య.

సంధ్యని పొంద లేని తాను ప్రపంచంలోకెల్లా దురదృష్టవంతుడు. అతని కళ్లల్లోంచి రెండు నీటి బొట్లు రాలిపడ్డాయి జాలిగా.

★

## దేవుణ్ణి అడిగే వరాలు



దేవుడు కనిపిస్తే మీరే వరాలు అడుగుతారని తారల్ని సరదాగా ప్రశ్నిస్తే వారు తమాషాగా చెప్పిన సమాధానాలు వినండి.. కాదు.. చదవండి-

★ నన్ను మరోజన్మలో కూడా ఇంతందంగానే పుట్టించు

- ప్రీతీజింటా

★ నేనే ఏ జన్మలోనైనా నెంబర్‌వన్‌గా ఉండాలి.

- షారూఖ్‌ఖాన్

★ ప్రతి మగాడు నన్ను చూసి టెంప్ట్ అవ్వాలి.

- మమతాకులకర్ణి

★ నా ప్రతి సినిమా హిట్‌కావాలి.

- అమీషాపటేల్

★ నాకూ, నా భార్యకు నిత్యయవ్వనత్వం ఉండాలి.

- సునీల్‌శెట్టి

★ నామీద వచ్చే రూమర్స్‌ని నిజం చెయ్యి.

- గోవిందా

★ నాలో ఉన్న సెన్సిటివ్ నేచర్‌ని పోగొట్టు.

- రాణీముఖర్జీ

- విరాజి

